సాక్షి
కర్నూలు
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



మొరాయిస్తున్న పోతిరెడ్డిపాడు గేటు

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు మొత్తం పది గేట్లు ఉన్నాయి. వీటిలో ఒకటో గేట్ రోప్ తెగిపోయింది. నాలుగో గేటు రెండు రోజులుగా మొరాయిస్తోంది. 8లో▸



కుళ్లి.. రైతుకు కన్నీరు మిగిలి!

అహోరాత్రులు శ్రమించి ఉల్లిని పండించిన రైతుకు కన్నీరే మిగిలింది. కర్నూలు మార్కెట్‌కు పంటను తీసుకురాగా గిట్టుబాటు ధరతో కొనే వారు కరువయ్యారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:13,024
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:12,666

న్యూస్‌రీల్

నేడు కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డుకు మంగళవారం సెలవు ప్రకటించామని, క్రయవిక్రయాలు జరగబోవని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని జేసీ డాక్టర్ బి.నవ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుఫెడ్ కొనుగోలు చేసిన 2,500 టన్నుల ఉల్లికి మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. ఈ వేలంలో రిటైలర్స్, హోల్‌సేల్ వ్యాపారులు, హోటల్ యాజమానులు పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

క్వింటా ధర రూ.100

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 18,099 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు వచ్చాయి. క్వింటాకు కనిష్టంగా రూ.100, గరిష్టంగా రూ.600 ధర ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన 10,022 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది.

న్యాయ సహాయానికి డయల్ 15100



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(హాస్పిటల్): ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే 15100 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న దిశ వన్ స్టాప్ సెంటర్, మహిళా ప్రాంగణం(శక్తి సదన్)ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించి వాటిని సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అందరూ అర్హులని తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్‌లో ప్రభుత్వం ద్వారా అందజేసే బాధితుల పరిహారానికి సంబంధించి రికార్డులు పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎంపీడీఓలకు నేడు, రేపు శిక్షణ

కర్నూలు(అర్బన్): మండల, గ్రామ పంచాయతీల్లో 'సొంత ఆదాయ వనరులు' అనే అంశంపై ఈ నెల 16, 17వ తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 53 మండలాలకు చెందిన ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జీ నాసరరెడ్డి తెలిపారు. ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో సొంత ఆదాయ వనరుల సృష్టి, సొంత ఆదాయంలో పన్ను వనరులు, పన్నుల వసూళ్లలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. తప్పనిసరిగా ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు హాజరు కావాలన్నారు.

కార్తీక శుద్ధ ఏకాదశిన కోటి దీపోత్సవం

- శ్రీశైలం ఈఓ శ్రీనివాసరావు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 1న కార్తీక శుద్ధ ఏకాదశి రోజున ప్రధాన ఆలయానికి ఎదురుగా గంగాధర మండపం వద్ద కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 21వ తేదీ వరకు శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తుండటంతో సోమవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మొదలైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్తీకమాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాలను ఆదేశించారు. ఆయా ఏర్పాట్లన్నీ అక్టోబరు 15వ తేదీ లోగా పూర్తి చేయాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ మాసంలో సిబ్బందికి విధుల వేళల మార్చుతామన్నారు. కార్తీకమాసమంతా మల్లన్న గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నామని, కార్తీకమాస శని, ఆది, సోమవారాల్లో, పౌర్ణమి మొదలైన పర్వదినాల్లో 15రోజుల పాటు సామూహిక అభిషేకాలు కూడా పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు.

గుట్టుగా గంజాయ్!

కర్నూలు మత్తులో తూలుతోంది!

- ఓ వ్యక్తి కనుసన్నల్లో విస్తరించిన సామ్రాజ్యం
- అరకు నుంచి తరచూ కార్లలో దిగుమతి
- పలు ప్రాంతాల్లో ఏజెంట్ల నియామకం
- పొట్లాలు కట్టి రిటైల్ వ్యాపారులతో విక్రయాలు
- నిద్దరోతున్న పోలీసు నిఘా విభాగం
- మరోసారి వివాదంలో కర్నూలు తాలూకా పీఎస్



వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి పొట్లాలు

కర్నూలు: జిల్లా కేంద్రం కర్నూలులో భారీగా గంజాయి పట్టుబడటం కలకలం రేపుతోంది. రాష్ట్ర సరిహద్దులోని విశాఖ జిల్లా అరకు కొండల్లో సాగైన గంజాయి విక్రయానికి ఏడాదిన్నరగా కర్నూలు అడ్డాగా మారడం పోలీసు శాఖ పనితీరును ప్రశ్నిస్తోంది. పంచలింగాల గ్రామానికి మీనుగ నరేంద్ర కింద పదుల సంఖ్యలో రిటైల్ వ్యాపారులు ఉన్నారు. గంజాయి కొనుగోలు చేసి పొట్లాలుగా కట్టి విక్రయాలు చేస్తున్నారు. ఆదివారం అరకు నుంచి కారులో గంజాయి తీసుకొచ్చిన నరేంద్ర సంతోష్ నగర్ వద్ద రిటైల్ వ్యాపారులకు సరఫరా చేసేందుకు సన్నద్ధమయ్యాడు. శ్రీరాం నగర్‌కు చెందిన రిటైల్ వ్యాపారి అరువు కింద ఇవ్వాలని కోరగా అందుకు నరేంద్ర అంగీకరించలేదు. దీంతో ఓ యువకుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గంజాయి ముఠా వ్యాపార రహస్యం వెలుగు చూసింది. కిలో రూ.15 వేల చొప్పున కొనుగోలు చేసి భారీ మొత్తంలో వారంలో మూడుసార్లు అరకు నుంచి కార్లు మారుస్తూ కర్నూలుకు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. స్థానికంగా పొట్లాల రూపంలో రిటైల్ వ్యాపారులకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది.

గంజాయి దందా వీరి కనుసన్నల్లోనే..

కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి చెందిన మీనుగ నరేంద్ర, ధర్మపేటకు చెందిన నల్లగొట్టి ఉమేష్ చంద్ర, జిల్లా కోర్టు సమీపంలోని సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన సిరిగిరి మృత్యుంజయ రెడ్డి, ఎస్‌బీఐ కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ ఆరిఫ్, కొత్తపేటకు చెందిన పగిడ్యాల చాకలి గోవర్ధన్.

నిఘా విభాగం ఏమి చేస్తున్నట్లు?

నిఘాలో కీలకంగా వ్యవహరించాల్సిన స్పెషల్ బ్రాంచ్ విభాగం ఏమి చేస్తోంది.. తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్న తలెత్తుతోంది. నేరుగా ఎస్పీ అజమాయిషీలో ఉండే ఈ విభాగం నుంచి ఆ సర్కిల్‌లో పనిచేస్తున్న సిబ్బంది పని తీరులో లోపమున్నట్లు పోలీసు శాఖలోనే చర్చ జరుగుతోంది. ఏడాదిన్నర కాలంగా యథేచ్ఛగా గంజాయి వ్యాపారం సాగుతుంటే గస్తీ పోలీసులు ఏమి చేస్తున్నట్లు అనే చర్చ జరుగుతోంది.

యథేచ్ఛగా గంజాయి వ్యాపారం

ఏడాదిన్నర కాలంగా ఈ ముఠా గంజాయి వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తోంది. కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పంచలింగాల కేంద్రంగా ఇ.తాండ్రపాడు, మునగాలపాడు, మాసా మసీదు, బాలాజీ నగర్, స్కంద వెంచర్‌తో పాటు కర్నూలు కొత్తపేట, ధర్మపేట ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని హోల్‌సేల్ వ్యాపారం సాగిస్తున్నారు. మీనుగ నరేంద్రపై గతంలో కూడా గంజాయి కేసులు ఉన్నాయి. జైలు నుంచి బెయిల్‌పై విడుదలై స్నేహితులతో ముఠాగా ఏర్పడి మళ్లీ అదే దందా కొనసాగిస్తున్నాడు. స్వగ్రామంలో అజ్గర్ బాషా, గుగ్గిళ్ల నాని, స్కంద వెంచర్‌లో లైఫ్‌బాయ్ సురేష్ తదితరులను ఏజెంట్లుగా నియమించుకుని వ్యాపారం కొనసాగిస్తున్నాడు. తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గంగమ్మ గుడి కేంద్రంగా యువకులను సమీకరించి గంజాయి సరఫరా చేస్తూ ఈ ముఠా సభ్యులు సొమ్ము చేసుకుంటున్నారు. 2019 నుంచి యథేచ్ఛగా గంజాయి వ్యాపారం సాగుతున్నట్లు పంచలింగాల ప్రజలు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.

అమాత్యుడి పీఏ పోలీసులకు ఫోన్

గంజాయి వాహనం కర్నూలుకు చేరుకోగానే శ్రీరాం నగర్‌కు చెందిన ఓ రిటైల్ వ్యాపారికి సమాచారం అందింది. అతని సూచన మేరకు అదే కాలనీకి చెందిన మరో యువకుడు సంచితో కారు వద్దకు చేరుకున్నాడు. ఈలోగా పోలీసులు అక్కడికి చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి తల్లి అమాత్యుడి వ్యాపార సంస్థలో ఉద్యోగి. తన కుమారుడిని పోలీసులు పట్టుకున్నారనే విషయాన్ని అమాత్యుడి పీఏ దృష్టికి తీసుకెళ్లడంతో వదిలిపెట్టాలంటూ పోలీసులపై తీవ్రంగా ఒత్తిడి చేసినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. పోలీసులకు పట్టుబడిన వారిలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుమారుడు కూడా ఉండటం గమనార్హం.

మరోసారి వివాదంలో కర్నూలు తాలూకా పీఎస్



- ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ముఠా సభ్యులకు సహకరించి ఇటీవలనే ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు సస్పెన్షన్‌కు గురయ్యారు.
- వారం రోజుల వ్యవధిలోనే అదే పోలీస్ స్టేషన్ పరిధిలోని పంచలింగాల గ్రామం కేంద్రంగా గంజాయి వ్యాపారం సాగుతున్నట్లు వెలుగు చూడటంతో మరోసారి చర్చనీయాంశంగా మారింది.
- గతంలో తనిఖీల్లో పట్టుబడిన 105 కిలోల వెండి ఇదే స్టేషన్‌లో భద్రపర్చగా ముగ్గురు సిబ్బంది కాజేసి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ కేసులో అప్పటి సీఐపై కూడా సస్పెన్షన్ వేటు పడింది.
- తమిళనాడుకు చెందిన వ్యాపారి వద్ద చెక్‌పోస్టు తనిఖీల్లో రూ.96 లక్షలు నగదు పట్టుబడగా అతనితో బేరాలు కుదుర్చుకుని గతంలో పనిచేసిన ఓ సీఐ రూ.12 లక్షలు మామూళ్లు దండుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అప్పట్లో పనిచేసిన సీఐపై కేసు నమోదై శాఖాపరమైన చర్యలకు గురయ్యారు.
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేవారికి సహకరించి గతంలో నలుగురు సిబ్బంది ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురై జిల్లా సరిహద్దు స్టేషన్లకు బదిలీ అయ్యారు.
- స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది అక్రమ కార్యకలాపాలపై ప్రతి సంవత్సరం సస్పెన్షన్ వేటు పడుతుండగా.. గంజాయి దందాతో మరోసారి తాలూకా పోలీస్ స్టేషన్ చర్చనీయాంశంగా మారింది.

డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం!



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కర్నూలు: డిజిటల్ అరెస్ట్ పేరుతో తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరించి రూ.8.40 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. వాట్సప్‌లో ఫేక్ వారెంట్ పంపి రెండు రోజుల పాటు ఎవరికీ చెప్పనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దండుకున్నారని, విచారణ జరిపి రికవరీ చేయాలని ఆయన ఎస్పీని వేడుకున్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా పాల్గొని వినతులను స్వీకరించారు.

చిప్పగిరిలో కుండపోత వర్షం

- చిప్పగిరిలో 99.8 మి.మీ వర్షపాతం నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో వర్షాలు కురిశాయి. చిప్పగిరిలో రికార్డు స్థాయిలో 99.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. జిల్లా సగటున 5.1 మి.మీ వర్షాలు కురిశాయి. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 106.4 మి.మీ వర్షం కురిసింది. కాగా అధిక వర్షాల వల్ల చిప్పగిరి, ఆదోని, కౌతాళం, తుగ్గలి, మద్దికెర మండలాల్లో పంటలకు భారీగా నష్టం జరిగింది. 1431 మంది రైతులు 1160 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు వ్యవసాయ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపింది.

ఎట్టకేలకు డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ లిస్టు విడుదల

- మిగిలిపోనున్న 88 పోస్టులు

కర్నూలు సిటీ: నిరుద్యోగ అభ్యర్థులను ఊరించిన డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ లిస్టు ఎట్టకేలకు సోమవారం విడుదలైంది. డీఎస్సీ ప్రకటన జారీ చేసినప్పటి నుంచి అనేక వివాదాలు, ఆందోళనల మధ్య ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్యలో 2,645, ఆశ్రమ పాఠశాలల్లో 33 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అయితే సర్టిఫికెట్ల పరిశీలనలో 2,590 పోస్టులకు మాత్రమే అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఇవ్వనున్నట్లు ఫైనల్ మెరిట్ జాబితా విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో 88 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో భర్తీకి నోచుకోవడం లేదు. ఉద్యోగాలకు ఎంపికైన వారందరూ గత నెలలో సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్న సెంటర్లకు 18వ తేదీ ఉదయం 7 గంటలకు రిపోర్టు చేసుకోవాలని, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో అభ్యర్థులతో పాటు ఒకరు సహాయకులుగా విజయవాడకు బయలుదేరి వెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ప్రకటన జారీ చేశారు.

కూటమి ప్రభుత్వంలో విగ్రహాలకు రక్షణ కరువు

- కనకదాసు విగ్రహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నేతలు



కనకదాసు విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో విగ్రహాలకు రక్షణ కరువైందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మాదాసి, మాదారి కురువ వైఎస్సార్‌సీపీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ అన్నారు. ఈ నెల 10వ తేదీన అర్ధరాత్రి ఆలూరు మండలంలోని మనేకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆ సంఘం నాయకులతో కలిసి సోమవారం విగ్రహాన్ని పరిశీలించి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు కొందరు ఇలాంటి పిరికి చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలి తప్ప విగ్రహాన్ని ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సంఘటన జరిగిన రోజే పత్తికొండ డీఎస్పీతో మాట్లాడి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని చెప్పానన్నారు. ధ్వంసమైన విగ్రహాన్ని ఇదే స్థలంలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతర సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విగ్రహాన్ని పగలకొట్టడం దారుణమన్నారు. అంతకు ముందు విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే విరూపాక్షి రూ. 20 వేలు, తెర్నేకల్ సురేందర్ రెడ్డి రూ.10 వేలు, వైఎస్సార్‌సీపీ కురువ సంఘం ధ్యక్షుడు గడ్డం రామకృష్ణ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ సర్పంచ్ కొల్లమ్మ, వైఎస్సార్‌సీపీ విభాగాల జిల్లా నాయకులు ఈరన్న, గిరి, శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ శ్రీరాములు, మల్లికార్జున రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లికార్జున, కో-కన్వీనర్ వీరేష్, నాయకులు వీరభద్రా రెడ్డి, శ్రీధర్ రెడ్డి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడిపోయింది. సోమవారం ఉదయం హెచ్‌ఎం ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాఠశాల గది తెరిచి చూసే సరికి తరగతి గది పెచ్చులూడిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పిందని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 615 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల తరగతి గదులు తడిచి పోయాయి. 7వ తరగతి గదిలో పై కప్పు సిమెంట్ పెంచులూడి తరగతి గది అంతటా చిందరబందరంగా పడి ఉంది. తరగతి గదులకు మరమ్మతులు చేయించి ప్రాణాపాయం జరుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు.



పాఠశాల గది పై కప్పు ఊడిపడిన సిమెంట్ పెంకులు

గిట్టుబాటు ధర లేకనే రైతు ఆత్మహత్య

- పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బాధిత రైతు కుటుంబాన్ని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: పండించిన ఉల్లికి గిట్టుబాటు ధర లేకనే రైతు కురువ రామచంద్రుడు ఆత్మహత్య చేసుకున్నాడని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి అన్నారు. రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందన్నారు. ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక వెల్దుర్తి మండలం కొసనాపల్లె గ్రామ రైతు కురువ రామచంద్రుడు ఆత్మహత్య చేసుకోగా కర్నూలు పెద్దాసుపత్రికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం మృతుని భార్య శివలక్ష్మీ దేవి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో కష్టాలు ఎదుర్కొని పంటలు పండించిన రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. రైతుల మనోధైర్యాన్ని మరింత దిగజారుస్తోందన్నారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, రైతులెవరూ మనో ధైర్యాన్ని కోల్పోవద్దని వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. యూరియా దొరకక, ఉల్లి, టమాటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి చూసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గల్లీల్లో స్కూళ్లు.. గాల్లో ప్రాణాలు!

- ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలకు పాతర
- తరగతి గదుల్లో వెలుతురు కరువు
- గాలి రాక అవస్థల్లో విద్యార్థులు
- తనిఖీలు చేయని విద్యాశాఖ అధికారులు

కర్నూలు సిటీ: జిల్లాలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. కర్నూలు నగరంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లలో, అపార్ట్‌మెంట్లలో, చిన్ని సందుల్లో ప్రైవేట్ స్కూళ్లను నిర్వహిస్తున్నారు. వీటిలో విద్యార్థుల భద్రత కరువైంది. ఇందుకు కీర్తి హైస్కూల్‌లో జరిగిన ఘటననే నిదర్శనంగా చెప్పవచ్చు. ఆ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది.

నిబంధనలకు పాతర!

కొన్ని ప్రైవేటు స్కూళ్లలో టాయిలెట్లు సరిగ్గా లేవని, తాగేందుకు మంచి నీరు కూడా లేదనే విమర్శలు ఉన్నాయి. వెలుతురు, గాలి రాని చిన్నపాటి తరగతి గదులు ఉంటున్నాయి. విద్యాశాఖ అధికారులు స్కూళ్లకు అనుమతులు ఇచ్చే, రెన్యూవల్స్ చేసే సమయంలో తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే నిబంధనలను పాతరేసి అనుమతులు ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పిల్లలకు ఆటలు నేర్పించేందుకు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు ఆట స్థలాలు లేవు. కనీసం వెయ్యి పుస్తకాలతో లైబ్రరీ కూడా నిర్వహించడం లేదు. భవనం పది మీటర్ల ఎత్తు దాటితే ఫైర్ సర్టిఫికెట్, సౌండ్ నెస్, బిల్డింగ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ట్రాఫిక్ క్లియరెన్స్ సర్టిఫికెట్ సైతం ఉండాలి. ఇవన్నీ కాగితాల్లోనే ఉంటున్నాయి.



కీర్తి హైస్కూల్ భవనం

చర్యలు తీసుకుంటాం

కీర్తి హైస్కూల్‌లో జరిగిన ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందారు. దీంతో స్కూల్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చాం. మంగళవారం కరస్పాండెంట్‌పై క్రిమినల్ కేసులు పెట్టనున్నాం. అదే విధంగా భవిష్యత్తులో ఇలాంటి సంఘటన ఎక్కడ జరుగకుండా తగిన చర్యలు తీసుకునేందుకు కర్నూలు నగరంలోని పాతబస్తీలోని అన్ని స్కూళ్లను తనిఖీ చేస్తాం. నిబంధనలు అతిక్రమించిన స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్. శామ్యూల్ పాల్, డీఈఓ.

విద్యాశాఖ నిర్లక్ష్యం!

కర్నూలు పాతబస్తీలోని కవాడివీధికి చెందిన ఖాజా బాషా, వజీదా దంపతుల కుమారుడు రాఖీబ్ మృతికి విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం..స్కూల్ యాజమాన్య అలసత్వమే కారణమని తెలుస్తోంది. కీర్తి హైస్కూల్‌లో సరైన వసతులు లేకపోయినా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయకుండానే అనుమతులకు రెన్యూవల్ చేశారు. స్కూల్ యాజమాన్యం చేసిన అలసత్వమే విద్యార్థి మృతికి కారణమని ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్‌ను తగులబెట్టిన దుండగులు


కాలిపోయిన ట్రాక్టర్

సి.బెళగల్: పెట్రోల్ పోసి ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టినట్లు బాధితులు తెలిపారు. కె.సింగవరం గ్రామానికి చెందిన తెలుగు రంగన్న ట్రాక్టర్‌తో గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పనిముగించుకుని తెలుగు రంగన్న కుమారుడు మహేష్.. ట్రాక్టర్‌ను ఈశ్వరామాలయం వెనుక ప్రాంతంలో వదిలి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10:30 గంటల సమయంలో ట్రాక్టర్‌పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. తెలుగు రంగన్న కుటుంబ సభ్యులు మంటలను అదుపు చేయగా అప్పటికే ట్రాక్టర్ ఇంజిన్ కాలిపోయింది. బాధిత రైతు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బండి ఆత్మకూరు: అదనపు కట్నం కోసం మహిళను వేధించిన భర్త, అత్తపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. లింగాపురం గ్రామానికి చెందిన షేక్ మాబున్నికి 16 ఏళ్ల క్రితం కల్లూరుకు చెందిన అన్వర్‌తో వివాహమైంది. కాగా తరచూ అదనపు కట్నం కోసం మాబున్నిని భర్త, అత్త షేక్ బీబీ అదనపు కట్నం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల(అర్బన్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శిరివెళ్ల మండలం కామినేనిపల్లె గ్రామానికి చెందిన కుమ్మరి నరసింహులు(37) కుటుంబ కలహాలతో చాబోలు గ్రామానికి చేరుకుని పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను స్థానికులు గమనించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మహిళతో కొన్నేళ్ల క్రితం అతనికి వివాహమైంది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్వింటా వేరుశనగ రూ.8,000

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధరలు కొంత మేర పెరిగాయి. మార్కెట్‌కు వేరుశనగ 125 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.3,806, గరిష్ట ధర రూ.8 వేలు లభించగా... సగటు ధర రూ.7,419 నమోదైంది. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ కనిష్ట ధర రూ.3,149, గరిష్ట ధర రూ.6,970 లభించగా... సగటు ధర రూ.6,490 నమోదైంది. ఒకే జిల్లాలో మార్కెట్‌కు మార్కెట్‌కు మధ్య ధరల్లో భారీ వ్యత్యాసం కనిపించింది.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి సర్కార్



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సర్కార్ ప్రతికా స్వేచ్ఛను సైతం హరించి వేస్తున్నారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రానికి స్థానం లేకుండా పోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రచురిస్తే పత్రికలు, ఎడిటర్లపై కేసులకు సైతం వెనుకాడటం లేదు. ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడికి తెగబడుతోంది. ప్రభుత్వ లోపాలు ఎత్తి చూపినందుకు ఇటీవల కాలంలో సాక్షి ఎడిటర్‌తోపాటు మరి కొందరిపై తాడేపల్లి పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గం. – కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బనగానపల్లె



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా కేసులు నమోదు చేయడం దారుణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛను గౌరవించాలి. కక్ష పూరితంగా వ్యవహరించడం పద్ధతి కాదు. రాజ్యాంగం విలువలను కాపాడాల్సిన ప్రభుత్వం పత్రికల గొంతు నొక్కడం సమంజసం కాదు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై కూటమి ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలి. విలేకరుల సమావేశంలో ఓ నాయకుడు మాట్లాడిన అంశాలను పత్రికలో ప్రచురిస్తే ఎడిటర్‌పై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉంది. 'సాక్షి'పై కక్షసాధింపు చర్యలు మానుకొని కేసులను ఉపసంహరించుకోవాలి. – బుట్టారేణుక, కర్నూలు మాజీ ఎంపీ


గార్గేయపురం డంప్ యార్డులో కుళ్లిపోయిన ఉల్లి సంచులు


కర్నూలు ఎస్ఎస్ ట్యాంకు సమీపంలో రైతులు కింద పోసిన ఉల్లిలో మంచి వాటిని ఏరుకుంటున్న మహిళలు


ధర లేక కర్నూలు మార్కెట్ యార్డులో వదిలేసిన వెళ్లిన ఉల్లి సంచులు

కుళ్లి.. రైతుకు కన్నీరే మిగిలి!

'ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయలేదు' అని పెద్దలు అంటూ ఉంటారు. ఉల్లిపాయలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో ఈ నానుడి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పెద్దల మాటలను, రైతుల కష్టాన్ని పట్టించుకోవడం లేదు. ప్రజలకు ఎంతో మేలు చేసే ఉల్లిగడ్డలు వృథాగా ఉండి కుళ్లిపోతున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, ప్రకృతి వైపరీత్యాలను ఎదిరించి, అహోరాత్రులు శ్రమించిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. వేల రూపాయలు ఖర్చు చేసి కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చినా గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేసే వారు కరువయ్యారు. దీంతో ఉల్లి సంచులను వదిలేసి వెళ్లారు. కర్నూలు మార్కెట్‌లో ఎక్కడ చూసినా ఉల్లి దిగుబడులే కనిపిస్తూ పాలన వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


ఉల్లి పంటను కర్నూలు మార్కెట్ యార్డు బయటే దింపిన దృశ్యం


కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా ఇలాంటి దృశ్యాలే..


ఉల్లిగడ్డలు కుళ్లిపోయిన దృశ్యం

పెళ్లి చేసుకుని యువతి మోసం

- పోలీసుల అదుపులో యువతి, మరో ఇద్దరు

హొళగుంద: డబ్బు కోసం ఎంతటి మోసానికైనా పాల్పడుతున్నారనేందుకు నిదర్శనం ఈ ఘటన. పవిత్ర వివాహ బంధాన్ని కూడా ఇందుకు వాడుకుంటున్నారు. పెళ్లికి ఎదురు కట్నం తీసుకుని పట్టుమని 20 రోజులు కూడా కాపురం చేయకుండా యువతి ఉడాయించడంతో పెళ్లి పేరుతో ఓ ముఠా చేసిన మోసం వెలుగులోకి వచ్చింది. మోసపోయిన యువకుడి ఫిర్యాదు మేరకు రాజమండ్రికి చెందిన యువతితో పాటు ఆమెకు సహకరించిన ఒక మహిళ, మరో వ్యక్తిని హొళగుంద పోలీసులు సోమవారం అదుపులో తీసుకున్నారు. వివరాలు ఇవీ.. ముద్దటమాగి గ్రామానికి చెందిన ఓ యువకుడు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనలు చూసి రెండు నెలల క్రితం రాజమండ్రికి వెళ్లి మ్యారేజ్ బ్యూరోను సంప్రదించాడు. వారు ఓ యువతిని పరిచయం చేసి రూ.4 లక్షలకు పైగా ఎదురు కట్నం ఇప్పించి వివాహం చేయించారు. ముద్దటమాగి గ్రామానికి వచ్చిన యువతి రెండు వారాలు పాటు కాపురం చేసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. యువకుడు, అతని బంధువులు రాజమండ్రికి వెళ్లి విచారించి మోసం చేసినట్లు తెలుసుకున్నారు. హొళగుంద పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సాంకేతిక పరిజ్ఞానంతో యువతితో పాటు మరొక మహిళ, ఇంకో వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న యువతికి ఇది వరకే పెళ్లి జరిగిందని, ముద్దటమాగి యువకుడితో పెళ్లి తర్వాత తాజాగా రాయచూరులోని మరో వ్యక్తితో వివాహం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

పాముకాటుతో యువ రైతు మృతి


రవి (ఫైల్)


ఆలూరు రూరల్: పాము కాటుతో యువ రైతు రవి మృతిచెందాడు. ఈ విషాద ఘటన ఆలూరు మండలం అరికెర గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవి (32) గ్రామ సమీపంలో రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. సోమవారం పొలంలో కూలీలు తీసిన పత్తి దిగుబడులను ట్రాక్టర్‌లో వేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం ట్రాక్టర్‌లో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. రవికి భార్య లత (ప్రస్తుతం 9 నెలల గర్భవతి), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబీకులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

పరామర్శించిన ఎమ్మెల్యే విరూపాక్షి

పాముకాటుతో రవి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సిద్ధేశ్వరునికి సూర్యాభిషేకం

హొళగుంద: శ్రీసిద్ధేశ్వరస్వామి విరాట్ మూర్తిని సోమవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. హొళగుందలోని ఆలయం గర్భగుడిలోకి ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో సూర్య కిరణాలు తాకుతాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో కూడా కిరణాలు తాకినట్లు ఉపాధ్యాయుడు, పురోహితుడు శాంతవీరమూర్తి స్వామి, గ్రామస్తులు తెలిపారు. గర్భగుడి లోపలి వరకు వెళ్లిన సూర్యకిరణాలు విరాట్ మూర్తిని తాకడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారితో పాటు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.


సిద్ధేశ్వరస్వామి విరాట్‌మూర్తిని తాకిన సూర్య కిరణాలు

ఎన్ఆర్ఈజీఎస్ విజిలెన్స్ ఆఫీసర్‌గా షకిలా బేగం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా షకిలాబేగం నియమితులయ్యారు. అనంతపురం జిల్లాలో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఈమెకు డీఎల్‌డీవోగా పదోన్నతి లభించింది. పదోన్నతిపై కర్నూలు డ్వామా విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్యకు బొకే సమర్పించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపాధి పనుల్లో అక్రమాలను వెలికి తీయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

జీడీపీ నుంచి 600 క్యూసెక్కుల నీరు విడుదల

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ) క్రస్టు గేట్లను ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని హంద్రీ నదికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తం 3.8 టీఎంసీల నీటిని నిలువ ఉంచుకొని అన్ని గేట్లు మూసివేస్తామని ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు.

యువతి ఆత్మహత్య

కర్నూలు: నగర శివారు నందికొట్కూరు రోడ్డులోని అయాన్ డిజిటల్ కోచింగ్ సెంటర్ ఎదురుగా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అంగడి సుమేధ (22) భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. లోకేష్, శిరీష దంపతులిద్దరూ ఉపాధ్యాయులు. వీరికి ఇద్దరు కూతుర్లు సంతానం. పెద్ద కూతురు సుమేధ బీటెక్ పూర్తి చేసింది. మూడేళ్లుగా మానసిక రోగంతో చికిత్స పొందుతోంది. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంట్లో పనిలో నిమగ్నమై ఉండగా సుమేధ మిద్దె పైనుంచి కిందికి దూకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి


విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సోమవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని పీఆర్ ఎస్‌ఈ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయం ముందున్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఇంజినీర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్ రిటైర్డు ఎస్‌ఈ కె.సుబ్రమణ్యం, కర్నూలు, ఆదోని ఈఈలు మహేశ్వరరెడ్డి, టీసీ వెంకటేష్, డీఈఈలు బండారు శ్రీనివాసులు, రమేష్‌కుమార్‌రెడ్డి, కర్రెన్న, నాగిరెడ్డి, ధనిబాబు, భాస్కర్, రంగస్వామి, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.రవీంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.సతీష్‌కుమార్, డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముక్తార్‌బాషా, ఆర్‌సీ ప్రకాష్, డీఏఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం మైసూర్ సంస్థానం దివానుగా ప్రజలకు చేసిన సేవలకు గుర్తుగా బ్రిటీష్ ప్రభుత్వం నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ బిరుదును ఇచ్చి సత్కరించారన్నారు. 1955లో భారత ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను ఇచ్చి గౌరవించిందన్నారు. మైసూలోని కృష్ణరాజ సాగర్‌కు ఆయన చీఫ్ ఇంజనీరుగా పనిచేశారని గుర్తు చేశారు. అనంతరం విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న డీఈఈలు రమేష్‌కుమార్‌రెడ్డి, రంగస్వామి, ఏఈఈలు ఆర్ సతీష్‌కుమార్, ఆర్ పార్థసారథి, ఏఈ మాలిక్‌లను ఘనంగా సన్మానించారు.

మొరాయిస్తున్న పోతిరెడ్డిపాడు గేటు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 4వ గేటు రెండు రోజులుగా మొరాయిస్తోంది. హెడ్‌రెగ్యులేటర్‌కు పదిగేట్లు ఉండగా అందులో 1వ గేటు రోప్ తెగిపోవటంతో దానికి మరమ్మతులు నిర్వహించకుండా దాన్ని ఆపరేట్ చేయటం లేదు. మిగిలిన తొమ్మిదిగేట్లల్లో ప్రస్తుతం 2, 4, 5, 6, 7 గేట్లను మాత్రమే ఆపరేట్‌చేస్తూ ఎస్సార్‌ఎమ్సీకి నీటిని విడుదల చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పోతిరెడ్డిపాడు నుంచి నీటిసరఫరాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8 వేల క్యూసెక్కులకు తగ్గించారు. ఈ క్రమంలో 2, 5, 6, 7 గేట్లను కిందికి దించగా అవి కిందికి దిగాయి. 4వ గేటును కిందికి దించేందుకు యత్నించగా కిందికి దిగకుండా రెండు అడుగుల ఎత్తులో మొరాయించింది. దాన్ని కిందికి దింపేందుకు పోతిరెడ్డిపాడు పర్యవేక్షణాధికారులు ఎస్‌సీఎల్ సిబ్బంది సహకారంతో రెండు రోజుల నుంచి గేటుకు జాకీలను అమర్చి వెల్డింగ్ చేయటం ద్వారా కిందికి దించేందుకు యత్నిస్తున్నా ఫలించలేదు. ఈ విషయమై పోతిరెడ్డిపాడు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డిని వివరణ అడగ్గా గేటు కిందికి దిగకపోయినా ఎలాంటి ఇబ్బందుల్లేవన్నారు. ప్రస్తుతం 4వ గేటు ద్వారానే 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటిసరఫరా పెంచాలన్నప్పుడు గేటును పైకి ఎత్తి నీటి విడుదలను పెంచటం జరుగుతుందని తెలిపారు.


గేటును కిందికు దించేందుకు యత్నిస్తున్న దృశ్యం

ట్యాబ్‌ల చోరీ నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసి చూపిస్తున్న పోలీసులు

నంద్యాల: పట్టణంలోని కేఎస్ఎం హైస్కూల్ సమీపంలోని డిప్యూటీ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ట్యాబ్‌లు చోరీకి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్లు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ తెలిపారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డిప్యూటీ డీఈఓ కార్యాలయంలోని 90 ట్యాబ్‌లు, 60 అడాప్టర్లు, 150 ఓటీజీ కేబుల్స్, రెండు స్పైక్ గార్డ్‌లు ఇటీవల చోరీకి గురయ్యాయి. ఏపీ సమగ్ర శిక్షణ అధికారి దస్తగిరిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. పట్టణంలోని చాంద్‌బాడ వీధికి చెందిన షేక్ హుసేన్‌వలి, ఒక మైనర్ బాలుడు ఈ చోరీకి పాల్పడ్డారని, వీరిని సోమవారం భీమవరం రోడ్డులోని ఈద్గా సమీపంలోని అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి అపహరణకు గురైన రూ.6.93 లక్షలు విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచామన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం


కార్యాలయంలోని విలువైన కంప్యూటర్ సామగ్రి

పగిడ్యాల: ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాల్సిన సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా కార్యాలయానికి తాళాలు వేయకుండా వెళ్లిన ఉదంతం సోమవారం నెహ్రూ నగర్ సచివాలయం 2లో చోటుచేసుకుంది. దాదాపు 13 శాఖలకు సంబంధించిన ఉద్యోగులు అక్కడ పని చేస్తున్నా వారి మధ్య సమన్వయం లేకపోవడంతో కార్యాలయానికి తాళం వేయకుండా ఇళ్లకు వెళ్లిపోయారు. సచివాలయంలో విలువైన కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలు, రికార్డులు ఉన్నప్పటికీ తమవి కాదన్నట్లు వెళ్లిపోవడం ఎంత వరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తాళం వేయలేని సంగతిని గుర్తించిన గ్రామస్తులు వీఆర్‌ఏకు సమాచారం అందించడం కార్యాలయానికి వేరే తాళం వేశారు. ఈ విషయమై ఎంపీడీఓ నాగేంద్రకుమార్‌ను అడుగగా.. విషయం తన దృష్టికి వచ్చిందని నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని వెల్లడించారు.


సచివాలయ భవనం ప్రధాన ద్వారానికి తాళం వేయని దృశ్యం


గ్రామ వీఆర్‌ఏ పందు లోపలి గదులకు తాళాలు వేస్తున్న దృశ్యం

ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం


తిరిగిబడ్డ ట్రాక్టర్


మృతి చెందిన మండ్ల సరస్వతి

కృష్ణగిరి: ట్రాక్టర్ బోల్తా పడటంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. కోయిలకొండ గ్రామానికి చెందిన కొందరు కూలీలు ట్రాక్టర్‌లో దేవనకొండ మండలం పీ. కోటకొండ వద్ద వేరుశనగ నూర్పిడి మిషన్ పనులకు సోమవారం ఉదయం బయలుదేరారు. మార్గమధ్యంలో కంబాలపాడు గ్రామం దాటిన వెంటనే రామలక్ష్మమ్మ బావి సమీపంలో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపుతప్పి రహదారి గుంతలో బోల్తా పడింది. దీంతో ట్రాలీలో ఉన్న వారంతా ట్రాలీ కింద చిక్కుకపోయారు. ట్రాలీలో వెనుక భాగంలో కొంత గ్యాప్ ఉండటంతో దాని ద్వారా అంతటా బయటపడ్డారు. ప్రమాదంలో గ్రామానికి చెందిన మండ్ల సరస్వతి(45) మృతి చెందారు. మరో వ్యక్తి రవికి గాయాలయ్యాయి. రహదారి వెంట వెళ్లే వారు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. సరస్వతికి భర్త మండ్ల బాలమద్ది, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.